క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 13, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 18, దొండ 18, చిక్కుడు 55, గోకర 50, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలు 23, దోస 23, సొర 9, పొట్ల 15, ఉల్లి 14 చామగడ్డ 50. మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

‘బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం’



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: బీజేపీతోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతోందని ఆ పార్టీ నాయకులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మూసారంబాగ్‌లో సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి, కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, మహిళా మోర్చా ఇన్‌చార్జి సుభాషచందర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా నాయకులు వైద్యులను, సిబ్బందిని, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు దశరథలక్ష్మి, గాయత్రి, డాక్టర్ తరుణ్, చంద్రకళ, మంజు, అంబాబాయి, తులసి, రమాదేవి, అపర్ణ, రాధా, కొప్పుల దినేష్, ఉన్నారు.

ఇఫ్తార్ విందు

మలక్‌పేట: హసీనా వెల్ఫేర్ ట్రస్ట్, స్కై ఐఎంఎఫ్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నల్లగొండ క్రాస్ రోడ్డులోని కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్, ఎండీ సాజీదా మాట్లాడుతూ, మన దేశంలో భిన్నత్వంలో ఏకత్వం కలిగి జీవిస్తామని, ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయోషా ఖదీర్, సభ్యులు లయన్ డాక్టర్ వీణ, సరస్వతి, షరీఫ్, బాలరాజ్, అస్రా, మజీదా తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



ఎమ్మెల్యేని సత్కరిస్తున్న శివయాదవ్

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి ఉత్సవాల రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన ఎల్‌బీనగర్‌కు చెందిన దూదిమెట్ల శివయాదవ్ సోమవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కిరణ్, చలపతి పాల్గొన్నారు.

బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బస్‌ను ప్రారంభిస్తున్న లిక్కి మమత

బడంగ్‌పేట్: ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ లిక్కి మమతారెడ్డి తెలిపారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 22వ డివిజన్‌లోని శివనారాయణపురం కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన శివనారాయణపురం కాలనీ నుంచి పటాన్‌చెరువు వరకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చొరవతో ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ లిక్కి మమతారెడ్డి విచ్చేసి బస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..శివనారాయణపురం కాలనీతో పాటు సాయిప్రభుహోమ్స్, సాయిటౌన్‌షిప్, సమత నగర్, వరలక్ష్మి నగర్ తదితర కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అక్యూపెన్సీ పెంచి బస్ సేవలు రద్దు కాకుండా చూడాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సహకారం అందించిన మిధాని డిపో వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు లిక్కి కృష్ణారెడ్డి, డిపో మేనేజర్ జె.ఆంజనేయులు, ఇంఛార్జి స్వామిగౌడ్, కాలనీవాసులు నరహరి, లక్ష్మణ్‌నాయక్, గంగాధర్‌రెడ్డి, నర్సింగరావు, బి.కృష్ణారెడ్డి తదితరులున్నారు.

‘విజిలెన్స్’ నియామకం ఎప్పుడో!

- రేషన్ సరుకులపై కొరవడిన పర్యవేక్షణ
- హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం సరుకుల సరఫరా



మహేశ్వరంలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

మహేశ్వరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ(విజిలెన్స్) కమిటీలు నామమాత్రమయ్యాయి. పర్యవేక్షణకు డివిజన్, మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై బియ్యం నాణ్యత పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై చర్చించాలి. పంపిణీ, అందించడంలో లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. డివిజన్, మండల స్థాయిలో కమిటీలు ఇంకా ఏర్పాటు చేయలేదు. పర్యవేక్షణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన ఆహార సలహా సంఘాలను తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. డివిజన్, మండల స్థాయిలో ఇప్పటివరకు కమిటీలను ఏర్పాటు చేసిన దాఖ లాలులేవు.

కమిటీలు ఇలా..

జిల్లా స్థాయి కమిటీలకు కలెక్టర్, డివిజన్ స్థాయి కమిటీకి ఆర్డీఓ, మండల స్థాయి కమిటీకి తహసీల్దార్ చైర్మన్లుగా ఉంటారు.మండల స్థాయిలో ఎంపీపీ సహా చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు,ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, ఇద్దరు జర్నలిస్టులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు రైతులు, రేషన్ డీలర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

సరుకుల నాణ్యతపై ఆరోపణలు..

కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు నాణ్యతలేని రేషన్ బియ్యం, సరుకులు సరఫరా చేస్తుండడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం గురించి పట్టించుకునేవారు లేకపోయారు. మండలంలోని కొన్నిరేషన్ దుకాణాల్లో నాసిరకం బియ్యం పంపిణీ అవుతున్నాయని లబ్ధిదారులు వ్యక్తం చేశారు.పాఠశాలలు, హస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా కొన్ని చోట్ల దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **త్వరలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేస్తాం**
>
> మహేశ్వరం మండలంలోని మొత్తం 47 రేషన్ దుకాణాలలో 17,796 రేషన్ కార్డులు ఉన్నాయి. మండల స్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఇంకా చేయలేదు. త్వరలో మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తాం. జిల్లా కలెక్టర్ అనుమతితో కమిటీలను నియమించి సమావేశాలను నిర్వహిస్తాం.ప్రతి హాస్టల్, పాఠశాలలో నాణ్యతతో కూడిన రేషన్ బియ్యం అందించేందుకు కృషి చేస్తాం.
>
> – ఎండి.మహమూద్ అలీ, తహసీల్దార్, మహేశ్వరం

మండలంలో రేషన్ దుకాణాలు, కార్డుల వివరాలు..

- మండలంలో మొత్తం రేషన్ దుకాణాలు–47
- ఆహార భద్రత కార్డులు– 15128
- అంత్యోదయ కార్డులు– 2657
- అన్నపూర్ణ కార్డులు –11

వెంటనే విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి రేషన్ బియ్యం, సరుకులపై పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిరస్మరణీయుడు బాల్‌రెడ్డి



సామ బాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రమణారెడ్డి

చంపాపేట: చంపాపేట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా 30 ఏళ్ల పాటు నిబద్ధతతో సేవలందించిన దివంగత సామ బాల్‌రెడ్డి చిరస్మరణీయుడని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి అన్నారు. సోమవారం బాల్‌రెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై నాయకుడు సామ నర్సింహారెడ్డితో కలిసి బాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ...బాల్‌రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో తన మిగులు భూమిని పేదలకు పంచి పెట్టడమే కాకుండా ఆయా ప్రాంతాలను రోషన్‌దౌలా, నేతాజీ నగర్, ముస్లిం బస్తీ, సుల్తానా అల్వా వంటి కాలనీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కూడా కల్పించారని గుర్తు చేశారు. సామ బాల్‌రెడ్డి ఆశయాలు నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సామ గౌతమ్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, నేతాజీ యువజన సంఘ అధ్యక్షుడు బైగళ్ల రవీందర్, నాయకులు యాదగిరి, ఆరె కృష్ణ, మెట్టు సంజీవరెడ్డి, సత్యనారాయణ, పెంటయ్య, దుర్గాదాసు, బెక్కం లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సంజన్న, దాసరి సంఘ అధ్యక్షుడు చిరంజీవి, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల జయంత్యుత్సవాల బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట చౌరస్తాలో ఈ నెల 22 న జరిగే మహనీయుల జయంత్యుత్సవాల ముగింపు సభ బ్రోచర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి సోమవారం ఆర్‌కేపురంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఉత్సవాల కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డికి అంబేడ్కర్ జయంతి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దాసరి కిరణ్, ఉపాధ్యక్షుడు దొబ్బ అంజన్ కుమార్, కోశాధికారి వావిలాల ఇందుమతి, సహాయ కార్యదర్శి దోమలపల్లి శివకాంత్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, శివ నాయక్ పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు ‘కల్యాణలక్ష్మి’ వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

ఎల్‌బీనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు పేదింటి ఆడపడుచులకు వరం లాంటివని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సరూర్‌నగర్ మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తాతో కలిసి మండలానికి సంబధించిన 146 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్, తహసీల్దార్ జయశ్రీ, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సోమవారం పంజేషాహాలోని కార్యాలయంలో ఫర్హత్‌నగర్, కట్టెలగూడ, కాలడేరా కాలనీ, హరిలాల్ బాగ్, చంచల్‌గూడ, ఆజంపుర ప్రాంతాలకు చెందిన 69 మంది లబ్ధిదారులకు ఆయన షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మొత్తం రూ. 69,08,004 లక్షల విలువైన సాయం అందజేశామన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఎంఐఎం నాయకులు ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం తగ్గింపు

మీర్‌పేట: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పట్టణ ప్రజలు ఆస్తిపన్ను మొత్తం చెల్లింపులో 5 శాతం తగ్గింపు పొందవచ్చని మీర్‌పేట కార్పొరేషన్ రెవెన్యూ అధికారి అంజన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ధరలు పెంచి పేదల ఉసురు తీస్తున్నారు

జీఎల్ఎఫ్ జిల్లా కమిటీ కన్వీనర్ బొ్ద్రమోని సుజాత

బడంగ్‌పేట్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆకాశాన్నంటే ధరలు పెంచి పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రంగారెడ్డి జిల్లా కమిటీ కన్వీనర్ బొద్రమోని సుజాత పాలకులపై మండి పడ్డారు. సోమవారం బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరిప్రియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.సుజాత మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చినప్పటి నుంచి పేద ప్రజలను మాటలతో మైమరిపించి పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలో భాగంగా దళితులకు ఇస్తామన్న మూడు ఎకరాలు ఏమైనావని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు కలిసి ధరలు పెంచి పేదలను మరింత పేదలుగా మారుస్తున్నారని మండిపడ్డారు. నేడు భూసర్వే పేరుతో సర్వేలు చేసి పేద ప్రజల భూములను బడా కంపెనీలకు దారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాబోఏ ఎన్నికల్లో ఈ లాంటి పార్టీలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు. పేద ప్రజల కన్నీళ్లు తుడుచేందుకు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. ఈ నెల 10 నుంచి బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు, రస్తారోకోలు నిర్వహించి, వినతిపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి భాను ప్రసాద్, ఎంసీపీఐయూ సరూర్‌నగర్ మండల కార్యదర్శి సిహెచ్ రాజు, ఎంసీపీఐయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్తిరెడ్డి పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోండి



కంటి వెలుగు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: కంటి వెలుగు పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రసాయన ఎరువులతో కూడిన ఆహార పదార్థాలు తినడం వల్ల కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పండాల శ్రీను, గంగాని శ్రీను, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించేందుకు ముద్రించిన పుస్తకాలను అందజేసిన దృశ్యం

నాగోలు: వయోవృద్ధులు సైబర్ క్రైమ్, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధి పి.శ్యామ్‌కుమార్ సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్‌లో హెల్ప్ ఏజ్ ఇండియా, వయో వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో గూగుల్ సంస్థ సహకారంతో ఆన్‌లైన్ మోసాలపై వృద్ధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలకు ఎలా పాల్పడతారు, మోసగాళ్ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది వయోవృద్ధులకు శ్యామ్‌కుమార్ వివరించారు. పాన్‌కార్డు ఆధార్‌తో లింక్ చేసుకోమని, కేవైసీ అప్డేట్ చేసుకోమని మెస్సేజ్‌లు వస్తే ఏమి చెయ్యాలి, మన ప్రమేయం లేకుండా మన బ్యాంకు అకౌంట్‌లోని డబ్బులు డెబిట్ అయితే ఎలా ఫిర్యాదు చేయాలన్నారు. వయో వృద్ధులు ఏ విధమైన సహాయం కోసమైనా హెల్ప్ ఏజ్ ఇండియా, హైదరాబాద్ సిటీ పోలీస్ నిర్వహిస్తున్న వయోవృద్ధుల సహాయ కేంద్రం 1800–180–1253 ను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ అవగాహన కల్పించేందుకు ముద్రించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు రామకృష్ణరావు, రాజారెడ్డి, లక్ష్మీకాంతారావు, తిమ్మారెడ్డి, పరశురామ్, ఆశాలత, సంజీవ రాణి, సీతారామ రాజు, సుబ్బారావు, చెన్నారెడ్డి, న్యూ నాగోల్ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షుడు కొమర్రాజు జ్ఞానకుమార్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



లచ్చిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ కాలనీలో నెలకున్న మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన కాలనీలో పాదయాత్ర నిర్వహించి వెలగని వీధి దీపాలు, పచ్చదనం కరువైన పార్కు, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...త్వరలో ప్రత్యేక నిధులతో కాలనీలో నెలకున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, శ్రీధర్‌రావు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న చింతల అరుణ

నాగోలు: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు అందజేసే రంజాన్ తోఫా కిట్లను సోమవారం నాగోలు డివిజన్ బండ్లగూడ, జైపురికాలనీ మసీదులో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్రా జకాత్ దానధర్మాలు చేస్తుంటారన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే ‘రంజాన్’ మాసమని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు

రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



విజయదుర్గాకాలనీలో పర్యటిస్తున్న రంగారెడ్డి

హస్తినాపురం: అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం తప్ప.. పనుల్లో పురోగతి కనిపించడం లేదని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కారం గాక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సోమవారం ఆయన హస్తినాపురం డివిజన్ పరిధిలోని విజయదుర్గానగర్, చైతన్యనగర్, వివేకానందకాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్ల పనుల కోసం 2021 డిసెంబర్ 2న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, ఏడాది దాటినా నేటికీ ఆ పనులు ప్రారంభం కాకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయని విమర్శించారు. హస్తినాపురం డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో వరద ముంపు సమస్య తీవ్రంగా ఉందని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చైతన్యనగర్ కాలనీ అసోసియేషన్ వారు 2023 జనవరి 27న ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేస్తే పదిరోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారని, నేటికీ ప్రారంభం కాలేదని కాలనీవాసులు చెప్పారని రంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రజలు తిరుపతి, విజయ్‌కుమార్, ఎరుకల మల్లేశ్‌గౌడ్, అరుణసింగ్, శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ బాలరాజు నాయుడుకు కలాం ఎక్సలెన్సీ అవార్డు



డాక్టర్ బాలరాజు నాయుడు తదితరులకు అవార్డులు అందజేసిన నిర్వాహకులు

సైదాబాద్: చంపాపేటలోని ఓనస్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ బాలరాజు నాయుడు ఉత్తమ వైద్యుడి అవార్డ్ అందుకున్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ అండ్ మెడికల్ ఎక్సలెన్సీ అవార్డ్స్–2023 ప్రదానోత్సవంలో భాగంగా ఈయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. యాక్ట్ నౌ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో బాలరాజు నాయుడు ఉత్తమ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు సర్వేలో ఉత్తమంగా ఎంపికైన డాక్టర్ బాలరాజు నాయుడు, డాక్టర్ స్వరూప్, డాక్టర్ కార్తీక్‌లకు అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కేంద్రం కృషి



‘ఇంటింటికి బీజేపీ’ కార్యక్రమంలో పాల్గొన్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: దేశంలో అన్నివర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ అన్నారు. సోమవారం సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ‘పల్లె పల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా హరిగౌడ్ మాట్లాడుతూ, తెలంగాణలో బీజేపీ బలోపేతానికి ఓబీసీ మోర్చా నాయకులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని నాయకులను కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మలక్‌పేట ఓబీసీ మోర్చా కన్వీనర్ గంగిశెట్టి రాజేష్, నవీన్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం



హానీమాన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సైదాబాద్: సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద సైన్సెస్ ఆధ్వర్యంలో సైదాబాద్ రెవెన్యూ బోర్డ్ కాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ సంస్థలో ప్రపంచ హోమియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం సంస్థ ప్రాంగణంలో ఉన్న హోమియోపతి పితామహుడు డాక్టర్ హానీమాన్ కాంస్య విగ్రహానికి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్, అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.